అప్పన్నను దర్శించుకున్న నూతన కలెక్టర్

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని జిల్లా నూతన కలెక్టర్ ఎం.ఎన్.హరింద్ర ప్రసాద్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కప్పస్తంభం ఆలింగనం తదుపరి మండపం ప్రదక్షిణ స్వామి దర్శనం, వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసిన అనంతరం స్వామి వారి విశేష వస్త్రాలతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా

విశాఖ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరింద్ర ప్రసాద్

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగత శుభాకాంక్షలు తెలిపిన జిల్లా అధికారులు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ జిల్లా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, వారి అవసరాలను తీరుస్తానని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరింద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ప్రజలు తనని ఎప్పుడైనా కలవొచ్చని అన్నారు. ఇప్పటి వరకు పలు విభాగాల్లో, పలు స్థానాల్లో పని చేశానని, అన్ని వర్గాల వారి కష్టాలు, సమస్యలు తెలుసని వాటి పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తానని చెప్పారు. విశాఖ జిల్లా నూతన కలెక్టర్‌గా ఎం.ఎన్.హరింద్ర ప్రసాద్ బుధవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో ఉదయం 10.11 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై స్పం దించారు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన విశాఖ సర్వతోముఖా భివృ ద్ధికి అవిరళ కృషి చేస్తానని ఉద్ఘాటించారు. పర్యాటకంగా గుర్తింపు పొందిన ఈ ప్రాంతానికి మరింత గుర్తింపును తీసుకొచ్చేం దుకు చర్యలు తీసుకుంటానన్నారు. ముఖ్యంగా అర్బన్ ప్రాంతంలో ఉండే ప్రధాన సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తానని, ప్రజలకు స్వచ్ఛ మైన తాగునీరు అందిస్తామని చెప్పారు. ఆరోగ్య శ్రీ ద్వారా అందరికీ సేవలు అందేలా చర్యలు తీసుకుంటానని, వైద్యపరమైన సేవలను మరింత విస్తృతం చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శ కాలకు అనుగుణంగా ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

యువత నైపుణ్యానికి, ఉపాధికి ప్రాధాన్యం

రాష్ట్రంలో విశాఖకి ఓ ప్రత్యేకత ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ నగరాన్ని ఆర్థిక రాజధానిగా కూడా భావిస్తోందని గుర్తు చేశారు. ఆ లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకొని యువతకు అన్ని అంశాల్లో నైపుణ్య శిక్షణ అందిస్తామని, ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ప్రభుత్వ పాలసీకి అనుగుణంగా అన్ని రకాల కంపెనీలు వచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఆర్థిక, వాణిజ్య అంశాలే అజెండాగా కార్యాచరణ రూపొం దించుకొని ముందుకు సాగుతానని, నిర్దేశిత లక్ష్యాలకు అను గుణంగా అందరి సహకారంతో జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరింద్ర ప్రసాద్ పేర్కొన్నారు.

కలెక్టర్‌కు అధికారులు, ప్రముఖుల శుభాకాంక్షలు

జిల్లా నూతన కలెక్టర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఎం.ఎన్.హరింద్ర ప్రసాద్‌కు జిల్లా అధికారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. తన ఛాంబర్లో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, భీమిలి ఆర్డీవో భాస్కర రెడ్డి, కలెక్టరేట్ ఏవో దేవ్ ప్రసాద్, ఏపీ ఈపీడీసీఎల్ సూపరిం టెండెంట్ ఇంజనీర్ మహేంద్ర నాథ్‌తోపాటు ఇతర విభాగాల సూప రింటెండెంట్లు, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు, వైద్యాధి కారులు, తహశీల్దార్లు,

ఎంపీడీవోలు, పోలీసు శాఖకు చెందిన అధికారులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జీఓ 596 అసైన్డ్ భూముల అక్రమ కొనుగోలుపై సీపీకి విదసం ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖలో 596 జీఓ ద్వారా హక్కుదారు పట్టాలు మంజూరైన భూములు కొనుగోలులో జరిగిన మోసాలపై దర్యాప్తు జరపాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన పోలీసు కమిషనర్ బాగ్చిను మర్యాద పూర్వకంగా విదసం ప్రతినిధులు కలిశారు. 596 ఫ్రీ హెరాల్డ్ భూ కుంభకోణంపై దర్యాప్తు జరిపి బినామీల గుట్టు బయట పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ నెల రోజుల వ్యవధిలో వందల ఎకరాల అసైన్డ్ భూములు నలుగురు ఐదుగురు వ్యక్తుల పేరు మీద రిజిస్టర్ అయ్యాయన్నారు. అసైన్డ్ భూములను పెద్ద మొత్తాలలో కొన్న సూరెడ్డి త్రిలోక్, సుభాష్, కాలకొండ భరత్, అగర్వాల్ అనే వ్యక్తులు అసైన్డ్ భూములు ఫ్రీ హెరాల్డ్ కోసం జిల్లా కలెక్టరును దొడ్డిదారిలో వాడుకున్నారు అని ఆరోపించారు. ఈ భూముల మార్కెట్ విలువ రెండు నుండి మూడు కోట్లు ఉండగా ఈ బినామీలు దళితులపై బెదిరింపులకు పాల్పడి, ఎకరా 5 లక్షలకే కొనుగోలు చేయడానికి పాత కలెక్టరు సహకరించడం అన్యాయం అన్నారు. ఫ్రీ హెరాల్డ్ భూముల ఇన్‌సైడ్ ట్రేడింగ్‌పై సీపీ ప్రత్యేక దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరామన్నారు. దీనిపై సీపీ స్పందిస్తూ రెవెన్యూ దర్యాప్తుకు పోలీసు నుండి సహకరిస్తూ వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టి పేదలకు న్యాయం చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈతలపాక సుజాత, సోడాదాసి సుధాకర్, శామ్యూల్ కుమార్, బులా బస్కరరావు, కస్తూరి వెంకటరావు, ఎల్లెటి శ్రీనివాస్, రవి శేఖర్, అఖిల్ పాల్గొన్నారు.

పోర్ట్ చైర్మన్‌ను కలిసిన నూతన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నం జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎంఎన్ హరింద్ర ప్రసాద్ విశాఖపట్నం పోర్టు చైర్ పర్సన్ డా ఎం అంగముత్తును బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పోర్టు పరిపాలనా భవనంలో కలుసుకున్న వారిరువురు పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పోర్టు సెక్రటరీ టి వేణుగోపాల్ పాల్గొన్నారు.

పరవశించిన సింహగిరి

విశాలాంధ్ర - సింహాచలం: ఆదిశేషుడిపై శ్రీదేవి, భూదేవి సమేతుడ్కైన వ్కైకుంఠనాథుడు అయిదు శతాబ్దాల తర్వాత సింహగిరి శిఖరంపై దివ్య తేజోమయుడై కొలువుదీరిన వేళ ప్రకృతి పరవశించి పోయింది. వైకుంఠవాసుని మెట్ట వద్ద బుధవారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రారంభం అయ్యి సుమారు రెండున్నర గంటలపాటు జరిగింది. తొలుత స్వామికి విశ్వక్సేన, పుణ్యాహవచనం పూజలు నిర్వహించారు. అనంతరం విరాటపర్వ పారాయణం, నారాయణ పాశురాలు, గరుడాళ్వార్ విగ్రహస్థాపన, మంగళహారతి, స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు పాలు, పెరుగు, పంచామృతాలు అభిషేకం చేశారు. పట్టు వస్త్రాలు పూల దండలు, తులసి దళాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం స్వామికి అభిషేకం, ఆరాధన, నివేదన సమర్పించారు. కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసమూర్తి దంపతులు, సింబయాసిస్ నేత నరేష్, ఆలయ స్థానాచార్యులు టీపీ రాజగోపాలాచార్యులు, ప్రధాన అర్చకులు జి. శ్రీనివాసాచార్యులు, అలంకారి కర్రి సీతారామాచార్యులు, వేదపండితులు, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు బాగా కురిసి గ్రామాలన్నీ సుభిక్షింగా ఉండాలని ఆకాంక్షిస్తూ, రాళ్లపై వరదపాయసం పారించారు. ప్రత్యేక పూజల తర్వాత అర్చకులు అక్కడే పాయసం తయారు చేశారు. పండితులు వేద మంత్రోచ్ఛారణ చేస్తుండగా వరదపాయసం పోశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పాయసం స్వీకరించారు. కార్యక్రమంలో ఏఈవో ఆనంద్ కుమార్, ఈఈలు శ్రీనివాస రాజు, రాంబాబు, అధికారులు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పింఛన్ పెంపుతో ఆనందోత్సవాలు

విశాలాంధ్ర - గోపాలపట్నం: పెంచిన పింఛన్లు అందుకున్న వృద్ధులు దివ్యాంగులు ,వితంతువులు గ్రేటర్ విశాఖ 92వ వార్డు పద్మనాభ నగర్‌లో శ్రీ బాపూజీ దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో తమ ఆనందోత్సవాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నందవరపు సోములు, ప్రధాన కార్యదర్శి సక్కరి అన్నాజీ మాట్లాడుతూ ఈ ఆనందం ఊహకందనిది అని, ప్రతినెల 6,000/- పింఛను వస్తుందంటే దివ్యాంగులకు కనీస అవసరాలు తీరుతాయనడంలో సందేహం లేదన్నారు. డ్వాక్రా గ్రూపుల నాయకురాలు కూసి స్వప్న, మహిళా మండలి నాయకులు కట్ట కనకలక్ష్మి, అద్దాల పద్మావతి,కూసి కాసులమ్మ, శ్రీ బాపూజీ దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘం కమిటీ సభ్యులు ఎం.హరికృష్ణ, పార్ధన ఉట్టిట్టి, జనపరెడ్డి అనురాధ, స్థానిక పెద్దలు ధర్మారావు, అర్జునరావు, మడక తాతారావు, దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి అనంతరం చంద్రబాబు నాయుడు, గణబాబు ఫోటోతో కూడిన ఫ్లెక్సీలకు పాలాభిషేకాలు చేశారు.

కార్మిక సంక్షేమానికి రాజీలేని పోరాటం



విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: కార్మికుల సంక్షేమ విషయంలో రాజీలేని పోరాటం చేస్తామని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు నేడు సకాలంలో జీతాలు ఇవ్వలేని పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు వేతన సవరణ కోసం ఏడేళ్లగా ఎదురు చూస్తున్నారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్లో మెర్జ్ చేయాలని, అప్పుడే ప్లాంట్‌కు పూర్వ వైభవం వస్తుందన్నారు. యాజమాన్యం దుర్మార్గ ఆలోచనలు మాని ప్లాంట్ ప్రగతి కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్లాంట్లో నెలకొన్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో డి.మోహన్, వై.శ్రీనివాస్, వైవీ.సుబ్బారావు,. జీవీ.సుబ్బయ్య, గంట్యాడ గురుమూర్తి, వేణుబాబు, సత్యనారాయణ, గంగవరం గోపి పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ పునరుద్ధరణ పనులు

విశాలాంధ్ర - తగరపువలస: తగరపువలసలో అన్న క్యాంటీన్ పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ప్రతి పేదవాడి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌లను గత వైసిపి ప్రభుత్వం హయాంలో పక్కన పెట్టేశారు. ఇటీవలే ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పనులు పునరుద్ధరణకు మోక్ష లభించింది. గతంలో రోజువారి కూలీలు, పేదప్రజల కోసం 5 రూపాయలకే భోజన పథకం (అన్నా కాంటీన్లను) ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్నా కాంటీన్ పునరుద్ధరణ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం తమకు ఎంతగానో మేలు చేసుకూరుస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగా శరవేగంగా తగరపువలసలో పనులు ప్రారంభించారు.

జీవీఎంసీ కమిషనర్, పశ్చిమ ఎమ్మెల్యే విస్తృత పర్యటన

విశాలాంధ్ర - గోపాలపట్నం: జీవీఎంసీలో 8వ జోన్‌లో 89, 92 వార్డుల పరిధిలోని కొత్తపాలెంలోని ఎర్ర చెరువు, గోపాలపట్నం ప్రాథమిక ఉన్నత పాఠశాల తదితర ప్రాంతాలలో జీవీఎంసీ కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, విశాఖ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు పి.జి.వి.ఆర్ నాయుడు (గణబాబు), జీవీఎంసీ అధికారులతో బుధవారం సాయంత్రం కలిసి పర్యటించారు. ముందుగా కమిషనర్, విశాఖ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు గోపాలపట్నం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల అర్పించారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు గోపాలపట్నం హై స్కూలు స్వర్ణోత్సవాలు జరుపుకున్న పురాతనమైన స్కూల్ అని ఇక్కడ నుండి ఎంతోమంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో పలు క్రీడల్లో రాణించారని తెలిపారు. ఈ స్కూల్లో ఉన్న క్రీడా మైదానంలో లైటింగ్‌తో కూడిన వాకింగ్ ట్రాక్, స్కేటింగ్ రింక్, 100 మీటర్ల క్రీడా మైదానం, మొదలైనవి అభివృద్ధి చేయాలని శాసనసభ్యులు కమిషనర్‌ను కోరగా కమిషనర్ స్పందిస్తూ పరిశీలిస్తామన్నారు. అనంతరం 89వ వార్డులో గల కొత్తపాలెం ఎర్ర చెరువును వారు సందర్శించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ఎర్ర చెరువులో పూడికలు తొలగించి చెరువును అభివృద్ధి చేయాలని తెలుపగా కమిషనర్ పరిశీలించి చర్యలు చేపడతామని శాసనసభ్యులకు హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి బి.సురేష్ కుమార్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ హేమావతి, పర్యవేక్షక ఇంజనీర్లు కేవీఎన్ రవి, రామ్ మోహనరావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు రత్నాకర్, ఏడుకొండలు, ఏ.డి.హెచ్.సురేష్, ఏసీపీ రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్.ఎం.వి.వి.ఎస్.మూర్తికి గీతం ఘన నివాళి

విశాలాంధ్ర - మధురవాడ: గీతం విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, విశాఖ పార్లమెంట్ మాజీ సభ్యుడు, గాంధేయవాది స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్.మూర్తి 86వ జయంతిని బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. గీతం ప్రాంగణంలోని డాక్టర్ మూర్తి విగ్రహం వద్ద, గీతం సమీపంలోని డాక్టర్ మూర్తి స్మృతి వనం వద్ద గీతం అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పెద్ద ఎత్తున హాజరై నివాళులర్పించారు. గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎమ్.గంగాధరరావు మాట్లాడుతూ రాజకీయ, సామాజిక, సేవారంగాలలో విశేష కృషి చేసిన డాక్టర్ ఎం.వి.వి.ఎస్.మూర్తి దేశ ఉన్నత విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్‌ను గీతం విద్యాసంస్థల ద్వారా అగ్రస్థానంలో నిలిపారని కొనియాడారు. గీతం విశాఖ, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాల ద్వారా వేలాది మంది వృత్తి నిపుణులను దేశానికి అందించారన్నారు. గాంధీ మార్గంలో ప్రయాణించడం పట్ల ఎప్పుడూ ఆసక్తి కనబరిచేవారని అందుకే గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్ మెంట్ గా(గీతం) నెలకొల్పారని తెలిపారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధ వట్టం మాట్లాడుతూ సైన్స్ విజ్ఞానానికి పెద్దపీట వేయాలనే డాక్టర్ మూర్తి ఆశయ సాధనకోసం రూ.100 కోట్లరూపాయలతో మూర్తి ప్రయోగ శాలలు నెలకొల్పామని, ఏటా ప్రతిభ గల పరిశోధకులను గుర్తించి మూర్తి ఫెలోషిప్‌లను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గీతం ప్రో-వైస్ ఛాన్సలర్లు ప్రొఫెసర్ వై.గౌతమరావు, డాక్టర్ బి.గీతాంజలి, రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్, గీతం సలహాదారులు ప్రొఫెసర్ గొల్లు సూర్యనారాయణ, ప్రొఫెసర్ డి.హరినారాయణ, సీనియర్ ప్రొఫెసర్లు, డైరెక్టర్లు, డీన్‌లు హాజరయ్యారు.

అల్లూరి జయంతి నిర్వహణకు ఏర్పాట్లు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ అల్లూరి సీతారామరాజు జన్మస్థలమైన గ్రామంలో జూలై 4వ తేదీన అల్లూరి జయంతి వేడుకలు చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరింద్ర ప్రసాద్ హాజరు కానున్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఓఎన్‌జి ఫౌండేషన్ వారు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

విద్యా సంస్థల బందుకు సహకరించండి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: జూలై 4న జరిగే విద్యా సంస్థల బంద్‌కు విద్యా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని ఏ.ఐ.వై.ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుతరావు పిలుపు నిచ్చారు. ఏ.ఐ.ఎస్.ఎఫ్, ఎస్.ఎఫ్.ఐ, పి.డి.ఎస్.యూ, పి.డి.ఎస్.ఓ విద్యార్థి సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయని అన్నారు. విద్యా రంగ అపరిష్కృత సమస్యలతో పాటు నెట్, నీట్ పరీక్షల లీకేజిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నష్ట పోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు. గురువారం జరిగే విద్యా సంస్థల బంద్‌లో విద్యార్థులంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేసారు.

కళాకారులకు భవన సదుపాయం కల్పించాలి

విశాలాంధ్ర - మల్కాపురం: కళాకారులకు భవన సదుపాయం కల్పించాలని కోరుతూ గాజువాక మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యులు బుధవారం గాజువాక ఎమ్మెల్యే, రాష్ట్ర టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇల్లు స్థలాల కోసం ప్రస్తావంచగా ఆయన సాను కూలంగా స్పందించారన్నారు. అతి త్వరలోనే ఈ సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినట్లు సంఘ సభ్యులు తెలిపారు. అలాగే ఆగస్టు 18వ తేదీన జరిగే వార్షికోత్సవ వేడుకలకు ఆహ్వానించినట్లు తెలిపారు. పల్లాను కలిసిన వారిలో పైడ్రాజు నూనెల, గుడివాడ శ్రీనివాసరావు, కోటి వెంకటేశ్వరరావు, (నాని), అల్లు జోగి నాయుడు, సర్వసుధ అప్పారావు, శరత్ కుమార్, కె.మంగ, జ్యోతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

86వ వార్డులో నీటి సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: మహావిశాఖ నగరపాలక సంస్థ 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెం ప్రధాన రహదారి విస్తరణ పనులు జరుగుతున్నందున ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న నీటి సరఫరా పంపింగ్ మెయిన్ పైపులైను ప్రక్కకు మార్చుట జరుగుతున్నందున 4వ తేదీన నీటి సరఫరా జరగదని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం అధికారులు తెలిపారు. కావున 86వ వార్డు ప్రజలు తాగునీటికి కలుగు అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

సీపీని కలిసిన ఏఐటీయూసీ నేతలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: విశాఖపట్నం నూతన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శంఖ బ్రత బాగ్చిని బుధవారం ఏఐటీయూసీ నాయకులు బి.వెంకట రావు, యేల్లేటి శ్రీనివాస్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నగర ప్రజలకు ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు రాకుండా చూడాలన్నారు. దీనిపై నగర కమిషనర్ స్పందిస్తూ విశాఖ నగరంలో ప్రజలకు సేవ చేయడమే ప్రధాన లక్ష్యమని ప్రజల భాగస్వామ్యంతో ఫ్రెండ్లీ పోలీసుగా ముందుకు వెళ్తామన్నారు. నగరంలో ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తినా నేరుగా కలవాలని అన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

తండ్రి మృతి, కుమారుడికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తండ్రి, కొడుకులు ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కంచరపాలెం జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొనడంతో తండ్రి అక్కడికి అక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలైన కొడుకును ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. దీంతో కంచరపాలెం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది.

చెరువు పరిశీలన

విశాలాంధ్ర - తగరపువలస: తగరపువలస సమీపంలో ఉన్న చెరువును జనసేన నాయకురాలు పరిమి భువనేశ్వరి బుధవారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువు దుర్వాసన రావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందికి గురవు తున్నారు. దానితోపాటు వ్యర్థాలు, సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు చెత్తా చెదారం అంతా చెరువులో డంప్ చేస్తున్నారు. దీంతో ప్రజలు దుర్వాసనతో అనారోగ్యాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే జీవీఎంసీ కమిషనర్‌కు సమాచారం అందించగా వారు సత్వరమే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తగరపువలస కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - ఆనందపురం: అనందపురం మండలం గిడిజాల ఎంపీపీ పాఠశాల, లక్ష్మీదేవి పేట, దిబ్బడిపాలెం పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు కిట్లను మండల ఉపాధ్యక్షులు పాండ్రంకి శ్రీను చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందరూ సద్వినియోగం చేసుకుని చదవాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యం ఏర్పరచుకొని ఆ దిశగా విద్యను సాగించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, షూస్, బ్యాగులను కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శినగం అప్పలరాజు, మాజీ సర్పంచ్ కోరాడ రాము, ఉప సర్పంచ్ సోమనాయుడు, మాజీ ఎంపీటీసీ సినగం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మెడి కవర్‌లో ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌కి
విజయవంతంగా రోబోటిక్ శస్త్రచికిత్స

విశాలాంధ్ర- విశాఖ సిటీ: విశాఖపట్నంలోని ప్రముఖ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అయిన మెడికవర్ హాస్పిటల్ వైద్యులు 77 ఏళ్ల వయసు కలిగిన ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ రోగిని రక్షించడానికి ప్రత్యేకమైన రోబోటిక్ సహాయంతో శస్త్రచికిత్స విజయవంతంగా చేసినట్టు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ బిశ్వబసు దాస్ నేతృత్వంలో ఈ శస్త్రచికిత్స జరిగిందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దాస్ వివరాలు తెలిపారు. 'విప్పుల్ ప్రొసీజర్' అని పిలవబడే ఈ శస్త్రచికిత్స ను యుఎస్ కేంద్రంగా కలిగిన ఇంట్యూటివ్ రూపొందించిన అత్యుత్తమ రోబోటిక్-సహాయక శస్త్రచికిత్స వ్యవస్థలలో ఒకటైన డా విన్సీ సహాయంతో చేశామన్నారు. ఈ అరుదైన ప్రక్రియను ప్రపంచవ్యాప్తంగా కొద్దిమంది సర్జన్లు మాత్రమే చేశారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో సర్జికల్ రోబో సహాయంతో విప్పుల్ విధానాన్ని నిర్వహించడం ఇదే మొదటిసారి అన్నారు. కామెర్లు ముదిరి పోవటంతో పాటుగా శరీరమంతా దురదతో బాధపడుతున్న రోగికి చేసిన పరీక్షలలో ప్యాంక్రియాస్ (పెరియాంపుల్లరీ ప్రాంతం) తలలో క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయిందని, ఇతర కొన్ని ఆసుపత్రులు అతినికి ఓపెన్ విప్పుల్ విధానంతో శస్త్ర చికిత్స చేయించుకోవాలని సూచించారన్నారు. మెడికవర్ ఆసుపత్రిలో తదుపరి సంప్రదింపుల తర్వాత, రోగి రోబోటిక్ విప్పుల్ శస్త్రచికిత్స చేయించుకోవాలని సిఫార్సు చేసామని, ఈ ప్రక్రియలో ప్యాంక్రియాస్, డ్యూడెనమ్, పిత్త వాహిక, పిత్తాశయం యొక్క కొంత భాగాన్ని తొలగించడం అవసరం అని, క్యాన్సర్ కణజాలాలను తొలగించిన తర్వాత సర్జన్లు ఈ భాగాలన్నింటినీ మళ్లీ కనెక్ట్ చేయాలని, దీనికి ఖచ్చితమైన పునర్నిర్మాణం అవసరం పడుతుందని, దీంతో ఈ శస్త్రచికిత్స అత్యంత శిక్షణ పొందిన సర్జన్ల ద్వారా మాత్రమే చేయబడిందన్నారు. రోబోటిక్-సహాయక శస్త్రచికిత్స చేయించుకున్న రోగి కేవలం నాలుగు రోజులలో డిశ్చార్జ్ చేయబడి, రోజువారీ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించారన్నారు. రోబోటిక్-సహాయక శస్త్రచికిత్స వ్యవస్థల వంటి అధునాతన వైద్య సాంకేతికతల పరిచయం ఆసుపత్రిలో జీర్ణశయాంతర శస్త్రచికిత్సా విధానాలను మార్చిందన్నారు. ఇతర సంప్రదాయ పద్ధతుల కంటే రోబోటిక్ సర్జరీని కోరుకునే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, మూడు నెలల క్రితం డా విన్సీ ఆర్ ఏ ఎస్ వ్యవస్థను ఏర్పాటు చేసినప్పటి నుండి ఆసుపత్రి ఇటీవల 100 శస్త్రచికిత్సలను పూర్తి చేసిందన్నారు. తమ ఆసుపత్రిలో పిత్తాశయంలో రాళ్ల అపెండిక్స్ సర్జరీల వంటి సాధారణ కేసుల నుండి హెపాటో-ప్యాంక్రియాటో-బైలరీ సర్జరీల వంటి సంక్లిష్ట ప్రక్రియలు, ఫండోప్లికేషన్, గ్యాస్ట్రోఎంటెరోస్టోమీ మరియు అచలాసియా కార్డియా, కొలొరెక్టల్ సర్జరీ, తీవ్రమైన ఉదర అత్యవసర పరిస్థితులకి సంబంధించిన చికిత్సలతో సహా అనేక రకాల శస్త్రచికిత్సా విధానాలను నిర్వహిస్తామని, ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో లేదా సంప్రదాయ పద్ధతుల ద్వారా చేసిన ఈ ప్రక్రియలన్నీ ఇప్పుడు రోబోటిక్‌గా జరుగుతున్నాయని, మెరుగైన ఫలితాలు వస్తున్నాయని వివరించారు.

అపోలోలో అరుదైన సికిల్ సెల్ అనీమియాకు బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్స విజయవంతం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: నగరంలోని అపోలో ఆసుపత్రిలో అరుదైన సికిల్ సెల్ అనీమియా కు బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్స విజయవంతంగా పూర్తి చేసినట్టు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. 16 ఏళ్ల బాలుడు ఎం. యువరాజు 4 సంవత్సరాల వయస్సు నుండి తీవ్రమైన సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతున్నాడు. అతని వ్యాధి నోటి మందులకు ప్రతిస్పందించడం ఆగిపోయింది. అతను రక్తమార్పిడి, ఎముకల నొప్పి చికిత్స కోసం పలు ఆసుపత్రులను సంప్రదించారు. ఈ సమయంలో, అతని కుటుంబం విశాఖపట్నంలోని అపోలో హాస్పిటల్‌లో మెడికల్ ఆంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ బిఎంటి ఫిజిషియన్ డాక్టర్ రాకేష్ రెడ్డి బోయను సంప్రదించారు. ఈ వ్యాధికి బోన్ మ్యారో (స్టెమ్ సెల్) మార్పిడి మాత్రమే నివారణ అని డాక్టర్ రాకేష్ రెడ్డి బోయ వారికి వివరించారు. అతని అన్నయ్యను దాతగా గుర్తించారు. ఇది పూర్తిగా సరిపోలనప్పటికీ, మార్పిడి కోసం చికిత్స ప్రోటోకాల్‌లో కొన్ని మార్పులు చేయబడ్డాయి. అధిక మోతాదు కీమోథెరపీని నివారించడానికి జాగ్రత్తలు తీసుకోబడ్డాయి. భవిష్యత్తులో యువకులకు వంధ్యత్వానికి సంబంధించిన ప్రమాదాన్ని కూడా నివారించేలా చికిత్స చేశారు. పోస్ట్ ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత మాస్టర్ యువరాజు సికిల్ సెల్ అనీమియా సమస్యలు లేకుండా బాగానే ఉన్నారని వైద్యులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో స్టెమ్ సెల్ మార్పిడితో సికిల్ సెల్ అనీమియాను విజయవంతంగా నయం చేసిన మొదటి కేసు ఇదేనని చెప్పారు. డాక్టర్ రాకేష్ రెడ్డి బోయ నేతృత్వంలో వైద్యుల బృందం డాక్టర్ ప్రదీప్ వెంట్రపతి, డాక్టర్ సుమన్ దాస్, డాక్టర్ వేణి ప్రసన్న గేదల, డాక్టర్ రహీం ఇతర వైద్యులు సహాయక సిబ్బంది ఈ చికిత్స కార్యక్రమం లో పాల్గొన్నారు.

చర్మ సంరక్షణకు
సరైన పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: చర్మ సంరక్షణకి ఆహార ఎంపికలు మన చర్మం యొక్క ఆరోగ్యం రూపాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తాయని, దానికి అనుగుణంగా ఆహారాన్ని తీసుకోవాలని న్యూట్రీషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి అన్నారు. ఈ మేరకు బుధవారం చర్మ సంరక్షణ-తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ అల్ట్రా-ప్రాసెస్ చేయబడిన ఆహారాలు , చక్కెర అధిక వినియోగం చర్మ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తాయన్నారు. విటమిన్లు ఖనిజాలు అధికంగా ఉండే పండ్లు , కూరగాయలతో కూడిన ఆహారం చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. నారింజ, ఉసిరికాయ (గూస్బెర్రీ), నిమ్మ, ఆకు కూరలు, టొమాటోలు వంటి ఆహారాలను మీల్ ప్లాన్‌లలో క్రమం తప్పకుండా చేర్చవచ్చు. అదనంగా, బాదంపప్పులోని యాంటీఆక్సిడెంట్ లక్షణాలు, యువి రక్షణ ప్రయోజనాలు , విటమిన్ ఈ కంటెంట్ ఆరోగ్యకరమైన చర్మాన్ని నిర్వహించడానికి , వృద్ధాప్య సంకేతాలను ఎదుర్కోవడానికి ప్రయోజనకరంగా ఉన్నట్లు చూపబడిందన్నారు.

నిజానికి, ప్రచురించిన ఆయుర్వేదం, సిద్ధ మరియు యునాని గ్రంథాలు బాదం చర్మ ఆరోగ్యానికి మంచిదని చర్మ కాంతిని పెంచుతుందని వెల్లడి చేస్తున్నాయన్నారు.

నీళ్లతో పాటు, సరైన చర్మ ఆరోగ్యం కోసం డైట్‌లో సూప్‌లు, బాదములు, రసం, కొబ్బరి నీరు, ఇన్ఫ్యూజ్డ్ వాటర్ పండ్లు పొట్లకాయ వంటి హైడ్రేటింగ్ ఎంపికలను చేర్చడాన్ని పరిగణించాలన్నారు. తగినంత విశ్రాంతి నిద్ర ఉండేలా చూసుకోవాలని, ఈ చిట్కాలు చర్మాన్ని పోషించడంలో సహాయపడతాయని చెప్పారు.

నిరుపేదలకు నిత్యావసర వస్తువుల వితరణ

విశాలాంధ్ర- విశాఖ కలెక్టరేట్: రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ డైమండ్స్ , సోర్ ఫౌండేషన్ వారి సహకారంతో పేద వారికి నెలకు సరిపడ నిత్యవసర వస్తువులను అందజేశారు .దీప్తి నర్సింగ్ హెూం దగ్గర జరిగిన కార్యక్రమంలో వారికి సరుకులు అందజేశారు. రోటరీ క్లబ్ వైజాగ్ డైమండ్స్ ప్రెసిడెంట్ నీరజ మాట్లాడుతూ పేద వారికి తమ క్లబ్ ఎప్పుడు అండగా వుంటుందని చెప్పారు.

రోటరీ సెక్రటరీ కామేశ్వర రావు, ట్రెజరర్ నాగమన్నర్ , రోటరీ కెప్టెన్ కాళి ప్రసాద్, సోర్ ఫౌండేషన్ చైర్మన్ సతీష్, నగేష్, పదిహేను కిట్‌లు ఇవ్వడము జరిగింది. అసోకన్, పురుషోత్తమరావు, కామేశ్వరరావు, నగేష్, అశోకన్, పురుషోత్తమ పాల్గొన్నారు.

5న శివశక్తి నగర్ పీడర్‌లో విద్యుత్‌కు అంతరాయం

విశాలాంధ్ర - మధురవాడ: శుక్రవారం ఉదయం 8.00 నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకు మధురవాడ సబ్ స్టేషన్‌లో 11 కెవి శివశక్తి నగర్ ఫీడర్‌పై మరమ్మత్తుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని వినియోగదారులు సహకరించాలని ఏపీ ఈపీడీసీఎల్ ఆపరేషన్ జోన్ 3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పొలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మారికవలస జే ఎన్ ఎన్ యు ఆర్ ఎం హౌసింగ్ కాలనీ, వై.ఎస్.ర్ కాలనీ, గాయత్రీ విద్య హాస్పిటల్, కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీ, శివశక్తి నగర్ రోడ్, అయ్యప్పనగర్, శ్రీ లక్ష్మి నగర్, సద్గురుసాయి నాథ్ కాలనీ, గణేశనగర్ రోడ్, మొదలైన ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని కావున వినియోగదారులు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

విశాఖపట్నం పోర్ట్‌లో
1 మిలియన్ మొక్కల పంపిణీ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రపంచ పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల ముగింపు కార్యక్రమం విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సాంబమూర్తి ఆడిటోరియంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్ట్‌లో 1 మిలియన్ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని పోర్ట్ చైర్ పర్సన్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పోర్ట్ చైర్ పర్సన్ డా. ఎం.అంగముత్తు, మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో పోర్ట్ యొక్క అంకితభావాన్ని ప్రాధాన్యతను గుర్తు చేసారు. పర్యావరణ పరిరక్షణ అనేది సంబరాలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి ఇంటి నుంచి ప్రారంభం కావాలని ఆయన ఆకాంక్షించారు. భూమాతను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ,

పోర్ట్ భాగస్వాములు, వివిధ సంస్థల భాగస్వామ్యంతో 1 మిలియన్ మొక్కల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. మొక్కల పంపిణీకి సంబంధించి వీపీఏ ఇచ్చిన పిలుపునకు పలు సంస్థల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. ప్రతి ఒక్క పోర్ట్ ఉద్యోగికి ఒక మొక్కను పంపిణీ చేయాలని చైర్ పర్సన్ ఆకాంక్షించారు. మొక్కలకు సంబంధించి పోర్టుకి వచ్చిన 2,17,069 అభ్యర్థన లో 1,00,000 మొక్కలను విశాఖ జిల్లా నవ నిర్మాణ సమితికి 26,000 మొక్కలను విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్‌కు 20,000 మొక్కలను రామ్‌కీ గ్రూప్, బ్రాండిక్స్ కంపెనీకి 20000 మొక్కలను 15,000 మొక్కలను జివిఎంసి 5,500 నాట్లను సిఐఎస్ఎఫ్ విశాఖపట్నం యూనిట్లకు ఇతరులకు పంపిణీ చేసింది. పోర్టు పంపిణీ చేసిన మొక్కలలో రోడ్ల పై నాటే నిమ్మ, బాదం, కదంబ, వేప, పిప్పళి, కానుగ, గుల్మోహర్, స్పాతోడియా, టబేబుయా, మిల్లింగ్టోనియా, మహెూగనీ, ఇండియన్ టులిప్, టెర్మినాలియా, కాసియా, అకాసియా వంటి పలు రకాలు మరియు కొబ్బరి, మామిడి, జీడిపప్పు, సపోటా, గౌవా, సీతాఫల, జామ, యాపిల్, వాటర్ యాపిల్, ఆమ్లా వంటి పండ్ల మొక్కలు ఉన్నాయి.మొక్కల పంపిణీ కార్యక్రమంతో పాటు ఉద్యోగుల కోసం పెయింటింగ్, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి వాటిలో విజేతలకు బహుమతులను చైర్ పర్సన్ చేతుల మీదుగా అందజేసారు. పోర్ట్ భాగస్వాములకు పోర్ట్ లోని వివిధ విభాగాల మధ్య స్వచ్ఛ భారత్, పచ్చదనం వంటి అంశాలలో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేసారు.

పోర్టు చేపట్టిన 1 మిలియన్ మొక్కల పంపిణీ పర్యావరణ పరిరక్షణలో కీలకమైన అడుగని పర్యవరణ పరిరక్షణ కోసం పోర్టు చేపడుతున్న శాశ్వత ఆచరణలకు, అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ డిప్యూటీ చైర్ పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే, చీఫ్ విజిలెన్స్ అధికారి పిఎస్ఎల్ స్వామి, రామకృష్ణారావు, ఈఎంసీ, ప్రో కామేశ్వరరావు, విభాగాధిపతులు, అధికారులు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ వివరాలను పోర్ట్ కార్యదర్శి టి. వేణు గోపాల్ మీడియాకి తెలియజేశారు.

కోస్టల్ రైడర్స్ అద్భుత విజయం

విశాలాంధ్ర - పీఎం పాలెం: వైజాగ్ వేదికగా ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ఏపీఎల్ సీజన్ -3లో భాగంగా బుధవారం మధ్యాహ్నం పీఎం పాలెంలోని డా. వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా కోస్టల్ రైడర్స్, బెజవాడ టైగర్స్ జట్లు తలపడ్డాయి. 8 పరుగుల ఆధిక్యంతో కోస్టల్ రైడర్స్ అద్భుత విజయం సాధించింది. ఈ మ్యాచ్లో తొలత టాస్ గెలిచిన బెజవాడ టైగర్స్ బౌలింగ్ ఎంచుకొని బరిలోకి దిగింది. బ్యాటింగ్ బరిలోకి దిగిన కోస్టల్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోగా 170 పరుగులు చేశారు.

ఓపెనర్ బ్యాట్స్మెన్లు కెప్టెన్ షేక్ రషీద్ 47 బంతుల్లో 5ఫోర్లు, 3 సిక్సులు తో 67 పరుగులు చేసి అద్భుతమైన బ్యాటింగ్ చేశాడు. అలాగే అభిషేక్ రెడ్డి 22 బంతుల్లో 3ఫోర్లు, 2సిక్సులు తో 35 పరుగులు చేయగా చివరిలో దిగిన కార్తీక్ రామన్ 9 బంతుల్లో 19 పరుగులు చేసి మొత్తంగా 170 పరుగులు భారీ స్కోరును బెజవాడ టైగర్స్ ముందు నిలిపారు.

బ్యాటింగ్ బరిలోకి దిగిన బెజవాడ టైగర్స్ గడిచిన 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసి 8 పరుగులు తేడాతో ఓటమి చెందారు. ఓపెనర్ బ్యాట్స్మెన్లు ధృవకుమార్‌రెడ్డి, కెప్టెన్ రిక్కీ భుయ్, పైలా అవినాష్ లు అధిక పరుగులు చేసినప్పటికీ వికెట్లు కోల్పోవడంతో అతి చేరువలో ఓటమి చెందారు.

గేమ్ చేంజింగ్ అఫ్ ది మ్యాచ్ స్టీఫెన్ (కోస్టల్ రైడర్స్) సూపర్ స్ట్రైకర్ అఫ్ ది మ్యాచ్: ఎం అభిషేక్ రెడ్డి (కోస్టల్ రైడర్స్), ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ , ఎస్.కె. రషీద్ (కెప్టెన్, కోస్టల్ రైడర్స్)ఆరంజ్ క్యాప్ ఎస్.కె.రషీద్ సాధించారు.

కొత్తమ్మ తల్లి మారువారం పండగ సందర్భంగా
చీరలు పంపిణీ

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డులో కణితి గ్రామ దేవత శ్రీ కొత్తమ్మ తల్లి అమ్మవారి మారు వారం పండగను గ్రామస్తులు ప్రత్యేక పూజలు, ఉపహారాలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం కణితి గ్రామ దేవతల కమిటీ ఆధ్వర్యంలో సంవత్సరం మొత్తం మీద మరియు పండగలో వచ్చిన చీరలను సుమారుగా 500 మందికి పేద మహిళలకు కమిటీ వారు పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ విజయరామరాజు, ప్రగడ వేణుబాబు, సూరిశెట్టి పెంటారావు, ప్రగడ శ్రీనివాస్, చిత్రాడ సన్యాసిరావు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, అతికింశెట్టి రవి, గోనప్ సన్యాసినాయుడు, బొడ్డ సన్యాసిరావు, బొడ్డ గోవిందా, కణితి గ్రామ వివిధ కుల సంఘ నాయకులు, కమిటీ సభ్యులు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.